Telugu Bhakti Pages

www.telugubhakti.com

Printer friendly version

Join Telugu Bhakti Pages group to get updates/ to participate in Dharmic discussions and to share thrilling religious views and divine experiences.

Click http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

శ్రీమద్భగవద్గీత

ఓం శ్రీపరమాత్మనే నమః

అథ ద్వితీయోఽధ్యాయః - సాంఖ్యయోగః

సంజయ ఉవాచ

1 తం తథా కృపయావిష్టమ్ అశ్రుపూర్ణాకులేక్షణమ్ ।

విషీదంతమిదం వాక్యమ్ ఉవాచ మధుసూదనః ।

తం-తథా-కృపయా- ఆ విష్టం - అశ్రుపూర్ణాకులేక్షణం

విషీదంతం - ఇదం-వాక్యం - ఉవాచ-మధుసూదనః

తథా = ఆ విధముగా, కృపయా = కరుణచే, ఆ విష్టం = నిండియున్న వాడును, అశ్రు పూర్ణాకు లేక్షణం = కన్నీరు నిండిన వ్యాకులమైన నేత్రములు గలవాడును, విషీదంతం = శోకించు చున్నవాడును అగు, తం = అట్టి అర్జునుని, మధుసూదనః = శ్రీకృష్ణుడు, ఇదం = ఈ, వాక్యం = వచనమును, ఉవాచ = అనెను.

సంజయుడు పలికెను - ఈ విధముగా కరుణాపూరిత హృదయుడైన కనులలో అశ్రువులు నిండియున్న అర్జునునితో శ్రీకృష్ణభగవానుడు ఇట్లనెను.

శ్రీ భగవాన్ ఉవాచ

2 కుతస్త్వాకశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।

అనార్యజుష్టమస్వర్గ్యమ్ అకీర్తికర మర్జున ।

కుతః-త్వా -కశ్మలం- ఇదం-విషమే -సముపస్థితం

అనార్యజుష్టం - అస్వర్గ్యం - అకీర్తికరం - అర్జున

అర్జున = హే అర్జునా, అనార్యజుష్టం = శ్రేష్టులగువారికి తగనిదియు, అస్వర్గ్యం = స్వర్గము నకు అనర్హమైనదియు, అకీర్తికరం = అపకీర్తి నొనగూర్చునదియు, ఇదం = ఈ, కశ్మలం = అజ్ఞానము, విషమే = విషమ సమయమునందు, త్వా = నీకు, కుతః = ఎచ్చటనుండి, సముపస్థితం=దాపురించినది.

శ్రీభగవానుడు చెప్పెను - ఓ అర్జునా ! పామరులకు కలిగే, స్వర్గ పాప్తి ఇవ్వనిది,అప కీర్తి కలుగచేసే ఈ మోహము నీకు ఎట్లు దాపురించినది ?

3 క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।

క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ।

క్లైబ్యం - మా స్మ గమః-పార్థ-న-ఏతత్-త్వయి- ఉపపద్యతే

క్షుద్రం-హృదయదౌర్బల్యం - త్యక్త్వా- ఉత్తిష్ఠ-పరంతప

పార్థ=హే అర్జునా, క్లైబ్యం = నపుంసకత్వమును, మా స్మ గమః = పొందకుము, ఏతత్ = ఇది, త్వయి = నీ విషయమున, న ఉపపద్యతే = తగదు, పరంతప = హే పరంతపా, క్షుద్రం=తుచ్ఛమైన, హృదయదౌర్భల్యం = హృదయ దుర్బలత్వమును, త్యక్త్వా=విడిచి పెట్టి, ఉత్తిష్ఠ=లెమ్ము

కావున ఓ అర్జునా ! పిరికితనమునకు లోనుకావద్దు. నీకిది ఉచితము కాదు. ఓ పరంతపా ! తుచ్ఛమైన ఈ హృదయ దౌర్బల్యమును వీడి, యుద్ధముచేయుము.

అర్జున ఉవాచ

4 కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।

ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన

కథం-భీష్మం-అహం-సంఖ్యే-ద్రోణం-చ-మధుసూదన

ఇషుభిః-ప్రతి-యోత్స్యామి-పూజార్హౌ-అరిసూదన

మధుసూదన=హే కృష్ణా, అహం=నేను, పూజార్హౌ=పూజింపదగిన, భీష్మం=భీష్మపితామహుని, చ=మరియు, ద్రోణం=ద్రోణాచార్యుని, సంఖ్యే=యుద్ధమునందు, అరిసూదన=శ్రీకృష్ణా, ఇషుభిః=శరీరములతో, కథం= ఏ విధముగ, ప్రతియోత్స్యామి = ఎదిరించి పోరాడగలను.

అర్జునుడు పలికెను - ఓ మధుసూదనా! పూజ్యులైన భీష్మపితామహుని, ద్రోణాచార్యులను యుద్ధమున ఎదిరించి బాణములతో ఎట్లు ఎదిరించి పోరాడగలను.

5 గురూనహత్వా హి మహానుభావాన్

శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే ।

హత్వార్థకామాంస్తు గురూనిహైవ

భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్

గురూన్-అహత్వా-హి-మహానుభావాన్-శ్రేయః-భోక్తుం-భైక్ష్యం-అపి- ఇహ-లోకే

హత్వా-అర్థకామాన్-తు-గురూన్-ఇహ- ఏవ-భుంజీయ-భోగాన్-రుధిరప్రదిగ్ధాన్

మహానుభావాన్=మహానుభావులైన, గురూన్= గురువులను, అహత్వా= చంపక, ఇహలోకే = ఈ లోకమునందు, భైక్ష్యమపి=భిక్షాన్నమైనను, భోక్తుం=భుజించుట, శ్రేయః హి = శ్రేయస్కరము గదా, గురూన్= గురువులను, హత్వా తు = చంపి, ఇహ ఏవ = ఈ లోకమునందే, రుధిర ప్రదిగ్ధాన్ = రక్తసిక్తమైన, అర్థకామాన్= అర్థకామములనే, భోగాన్= భోగములను, భుంజీయ = అనుభవింతును.

మహానుభావులైన ఈ గురుజనులను చంపకుండా బిచ్చమెత్తుకొని యైనను ఈ లోకమున జీవించుట శుభదాయకము. ఏలనన ఈ గురుజనులను చంపినను, రక్తసిక్తములైన రాజ్యసంపదలను, భోగములను మాత్రమే నేను అనుభవింతునుగదా !

6 న చైతద్విద్మః కతరన్నో గరీయో

యద్వా జయేమ యది వా నో జయేయుః ।

యానేవ హత్వా న జిజీవిషామః

తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ।

న-చ-ఏతత్-విద్మః-కతరత్-నః-గరీయః-యత్-వా-జయేమ-యది-వా-నః
-జయేయుః
యాన్- ఏవ-హత్వా-న-జిజీవిషామః-తే-అవస్థితాః-ప్రముఖే-ధార్తరాష్ట్రాః

యాన్= ఎవరిని, హత్వా=చంపి, న జిజీవిషామః = జీవింపగోరమో, తే = అట్టి, ధార్త రాష్ట్రాః = ధృతరాష్ట్ర సంబంధులు, ప్రముఖే= ఎదుట, అవస్థితాః ఏవ = ఉన్నారుగదా, జయేమ యద్వా= మనము జయించినను, నః = మమ్ములను, జయేయుఃయది వాః= వారే గెలిచినను, ఏతత్=చ = ఈ విషయమును కూడా, నః = మాకు, కతరత్ = ఏది, గరీయః = శ్రేష్టమో, న విద్యః = మేమెరుగము.

ఈ యుద్ధముచేయుట శ్రేష్ఠమా ? లేక చేయకుండుట శ్రేష్ఠమా ? అనునది ఎఱుగము. యుద్ధమున వారిని మనము జయింతుమా ? లేక మనలను వారు జయింతురా ? అను విషయమునుగూడ ఎఱుగము. మనకు ఆత్మీయులైన ధార్తరాష్ట్రులే ఇచట మనలను ఎదిరించి యుద్ధముచేయ నిలిచి యున్నారు.

7 కార్పణ్య దోషోపహతస్వభావః

అపృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః

యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే

శిష్యస్తేఽ హం శాధి మాం త్వాం ప్రపన్నమ్

కార్పణ్య దోషోపహత స్వభావః - పృచ్ఛామి-త్వాం-ధర్మసమ్మూఢ చేతాః

యత్-శ్రేయః-స్యాత్-నిశ్చితం-బ్రూహి-తత్-మే-శిష్యః-తే-అహం -శాధి-మాం-త్వాం-ప్రపన్నం

కార్పణ్య=కృపణత్వమనెడి, దోష=దోషముచేత, ఉపహత=కొట్టబడిన, స్వభావః=ప్రకృతి గలవాడనై, ధర్మ సమ్మూఢచేతాః = ధర్మవిచక్షణ చేయలేని చిత్తముగలవాడనై, త్వాం = నిన్ను, పృచ్ఛామి = అడుగుచున్నాను, యత్= ఏది, నిశ్చితం=నిర్ణయింపబడి, మే=నాకు, శ్రేయః=శ్రేయము, స్యాత్=అగునో, తత్=అద్దానిని, బ్రూహి=చెప్పుము, అహం=నేను, తే=నీకు, శిష్యః=శిష్యుడను, త్వాం = నిన్ను, ప్రపన్నం = శరణుపొందిన, మాం = నన్ను, శాధి=శాసింపుము.

పిరికితనము చేత, నా స్వభావమును కోల్పోయి గిలగిలలాడుచున్నాను. ధర్మాధర్ములవిచక్షణకు దూరమై నా కర్తవ్యమును నిర్ణయించు కొనలేకున్నాను. నాకు నిజముగా శ్రేయస్కరమైన దానిని తెలుపుము. నేను నీకు శిష్యుడను. శరణాగతుడను, శాసింపుము.

8 న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్

యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్ ।

అవాప్య భూమావసపత్నమృద్ధం

రాజ్యం సురాణామపి చాధిపత్యమ్

న-హి-ప్రపశ్యామి-మమ-అపనుద్యాత్-యత్-శోకం- ఉచ్ఛోషణం- ఇన్ద్రియాణాం

అవాప్య-భూమౌ-అసపత్నం-ఋద్ధం-రాజ్యం-సురాణాం-అపి-చ- ఆధిపత్యం

భూమౌ = భూమియందు,అసపత్నం = తిరుగులేని,ఋద్ధం = సమద్ధమైన, రాజ్యం= రాజ్యమును, సురాణాం = దేవతలయొక్క, ఆధిపత్యం చ అపి = ఆధిపత్యమునూ, అవాప్య = పొందియును, ఇంద్రియాణాం= ఇంద్రియములను, ఉచ్ఛోషణం = శోషింప జేయు, మమ = నాయొక్క, శోకం = దుఃఖమును, యత్ = ఏది, అపనుద్యాత్ = పోగొట్టునో, న ప్రపశ్యామి హి = తెల్సుకోలేకున్నాను.

ఈ శోకము నా ఇంద్రియములను దహించివేయు చున్నది. సిరిసంపదలతో గూడిన శత్రువులులేని రాజ్యము లభించినను, కడకు సురాధిపత్యము ప్రాప్తించినను ఈ శోకదాహము చల్లారునుపాయమును తెలిసికోలేకున్నాను.

సంజయ ఉవాచ

9 ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతప ।

న యోత్స్య ఇతి గోవిందమ్ ఉక్త్వా తూష్ణీం బభూవ హ

ఏవం - ఉక్త్వా - హృషీకేశం - గుడాకేశః - పరంతపః

న-యోత్స్యే- ఇతి-గోవిందం - ఉక్త్వా-తూష్ణీం-బభూవ-హ

పరంతపః = శత్రువులను తపింపజేసెడి, గుడాకేశః = అర్జునుడు, హృషీకేశం = హృషీకేశుని, గోవిందం = గోవిందునితో, ఏవం = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, న యోత్స్యే = యుద్ధము చేయను, ఇతి =అని, ఉక్త్వా = పలికి, తూష్ణీం బభూవ హ= మౌనముగా వుండెను.

సంజయుడు పలికెను - ఓ రాజా! ఈ విధముగా పలికిన పిమ్మట అంతర్యామియైన శ్రీకృష్ణునితో అర్జునుడు, నేనుయుద్ధము చేయనే చేయను అని స్పష్టముగా చెప్పి, మౌనము వహించెను.

10 తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత ।

సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః ।

తం- ఉవాచ - హృషీకేశః - ప్రహసన్ - ఇవ - భారత

సేనయోః - ఉభయోః - మధ్యే - విషీదంతం - ఇదం - వచః

భారత = భరతవంశజుడవైన ధృతరాష్ట్రా, ఉభయోః = రెండైన, సేనయోః = సేనలయొక్క, మధ్యే = నడుమ, విషీదంతం = శోకించుచున్న, తం = ఆ అర్జునుని గూర్చి, హృషీకేశః = శ్రీకృష్ణుడు, ప్రహసన్ ఇవ = నవ్వుచున్నవానివలె , ఇదం = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను.

ఓ ధృతరాష్ట్రా ! ఇరుసేనల మధ్య శోకితుడైన అర్జునుని జూచి, శ్రీకృష్ణుడు చిరునవ్వుతో ఇట్లు పలికెను.

శ్రీభగవాన్ ఉవాచ

11 అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।

గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ।

అశోచ్యాన్ - అన్వశోచః - త్వం - ప్రజ్ఞావాదాన్ - చ - భాషసే

గతాసూన్ - అగతాసూన్ - చ - న - అనుశోచంతి - పండితాః

త్వం = నీవు, అశోచ్యాన్ = శోకింపదగనివారిని గూర్చి, అన్వశోచః = శోకించుచున్నావు, ప్రజ్ఞావాదాన్చ = పండిత వచనములను, భాషసే = భాషించుచున్నావు, గతాసూన్ = ప్రాణము పోయినవారిని గూర్చిగాని, అగతాసూన్ = ప్రాణము పోనివారినిగూర్చిగాని, పండితాః = పండితజనులు, న అనుశోచంతి = శోకింపరు.

శ్రీభగవానుడు పలికెను - ఓ అర్జునా! శోకింపదగని వారికొఱకై నీవు శోకించుచున్నావు. పైగా జ్ఞాని వలె మాట్లాడుచున్నావు. జ్ఞానులైనవారు ప్రాణములు పోయిన వారిని గూర్చిగాని, ప్రాణములుపోని వారిని గుఱించిగాని శోకింపరు.

12 న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।

న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ ।

న-తు- ఏవ-అహం-జాతు-న- ఆసం-న - త్వం - న - ఇమే- జనాధిపాః

న-చ- ఏవ-న-భవిష్యామః - సర్వే - వయం-అతః-పరం

అహం=నేను, జాతు = ఒకప్పుడు, న ఆసం = లేను, త్వం = నీవు, న = లే వు, ఇమే = ఈ, జనాధిపాః = రాజులును, న = లేరు అనునది, న తు ఏవ = లేనేలేదు, అతఃపరం = ఇకపిమ్మట, వయం సర్వే = మనమంతా, న భవిష్యామః= లేకపోవుటఅనునది యును, న చ ఏవ= లేనేలేదు.

నీవుగాని, నేనుగాని, ఈ రాజులుగాని ఉండని కాలమే లేదు. ఇక ముందు కూడ మనము ఉండము అనుమాటయే లేదు. (అన్ని కాలములలోను మనము ఉన్నాము. ఆత్మ శాశ్వతము. అది అన్ని కాలములయందును ఉండును. శరీరపతనముతో అది నశించునది కాదు).

13 దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।

తథా దేహాంతరప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి

దేహినః-అస్మిన్-యథా-దేహే-కౌమారం-యౌవనం - జరా

తథా - దేహాంతరప్రాప్తిః - ధీరః - తత్ర-న-ముహ్యతి

దేహినః=జీవునకు, అస్మిన్ = ఈ, దేహే - దేహమునందు, కౌమారం = బాల్యమును, యౌవనం =యౌవనమును, జరా=ముసలితనమును, యథా = ఏవిధముగా కలుగునో, తథా = అలాగుననే, దేహాంతరప్రాప్తిః = మరణము మరొక శరీరమును పొందుట, తత్ర = ఆ విషయమున, ధీరః = ధీరపురుషుడు, న ముహ్యతి = మోహము నొందడు.

జీవునకు ఈ దేహమునందు కౌమారము, యౌవనము, వార్ధక్యము ఉన్నట్లే మరణానంతరమున మఱియొక దేహప్రాప్తియు కలుగును. ధీరుడైనవాడు ఈ విషయమున మోహమునొందడు.

14 మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।

ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత ।

మాత్రాస్పర్శాః - తు-కౌంతేయ - శీతోష్ణసుఖదుఃఖదాః

ఆగమాపాయినః = అనిత్యాః - తాన్ -తితిక్షస్వ - భారత

కౌంతేయ = కుంతీకుమారా, మాత్రా స్పర్శాః = శ్రోత్రాదీంద్రియములు, శబ్దాది విషయముల సంయోగము, తు = అయితే, శీతోష్ణసుఖదుఃఖదాః = శీతోష్ణ సుఖదుఃఖములనున కల్గించు నవియును, ఆగమాపాయినః = క్షణభంగురములైనవియును, అనిత్యాః = అనిత్యమైనవి, భారత = హే అర్జునా, తాన్ = వీనిని, తితిక్షస్వ = సహించుము.

ఓ కౌంతేయా! విషయేంద్రియసంయోగమువలన శీతోష్ణములు సుఖదుఃఖములు కలుగుచున్నవి. అవి ఉత్పత్తి వినాశశీలములు. అనిత్యములు. కనుక భారతా ! వాటిని సహింపుము. (పట్టించుకొనకుము)

15 యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ ।

సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే

యం-హి-న-వ్యథయంతి- ఏతే-పురుషం-పురుషర్షభ

సమదుఃఖసుఖం-ధీరం-సః-అమృతత్వాయ-కల్పతే

పురుషర్షభ = ఓ పురుషశ్రేష్ఠా, ఏతే = ఈ మాత్రాస్పర్శములు, సమదుఃఖసుఖం=సుఖ దుఃఖముల యందు సమానబుద్ధి కలిగిన, ధీరః = ధీరుడైన,

యం పురుషం = ఏ పురుషుని, న వ్యథయంతి = చలింపజేయవు, సః హి = అట్టివాడు కదా, అమృతత్వాయ = అమృతత్వమును పొందుటకు, కల్పతే = అర్హుడు.

అర్జునా! ఓ పురుషశ్రేష్ఠా ! ధీరుడైనవానికి సుఖదుఃఖములు సమానముగా తోచును. అట్టి పురుషుని విషయేంద్రియ సంయోగములు చలింపజేయజాలవు. అతడే మోక్షమును పొందుటకు అర్హుడు.

16 నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।

ఉభయోరపి దృష్టోఽంతః త్వనయోస్తత్త్వదర్శిభిః ।

న-అసతః-విద్యతే-భావః-న-అభావః-విద్యతే-సతః

ఉభయోః-అపి-దృష్టః-అంతః-తు-అనయోః-తత్త్వదర్శిభిః

అసతః = అనిత్యమైనదానికి, భావః = ఉనికి, న విద్యతే=లేదు, సతః = సత్యమైనదానికి, అభావః = లేకపోవుట, న విద్యతే = లేదు, అనయోః = ఈ , ఉభయోః అపి = రెండిటియొక్క, అంతుః తు = నిర్ణయము, తత్త్వదర్శిభిః= తత్త్వజ్ఞులచేత, దృష్టః=దర్శించబడినది

అనిత్యమైనదానికి ఉనికియే లేదు. సత్యమైన ఆత్మకులేమి అనునదిలేదు. ఈ విధముగ ఈ రెండింటియొక్క వాస్తవస్వరూపములను తత్త్వజ్ఞానియైనవాడే దర్శించును.

17 అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।

వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ।

అవినాశి-తు-తత్-విద్ధి-యేన-సర్వం- ఇదం-తతం

వినాశం-అవ్యయస్య-అస్య-న-కశ్చిత్-కర్తుం - అర్హతి

యేన = దేనిచేత, ఇదం = ఈ, సర్వం= సర్వమును, తతం=వ్యాపించి యున్నదో, తత్ తు = అది, అవినాశి= నాశరహితమైనదిగ, విద్ధి=తెలిసికొనుము, కశ్చిత్= ఎవడును,

అవ్యయస్య = నశించని, అస్య=దీనికి, వినాశం=నాశనము, కర్తుం=చేయుటకు, న అర్హతి=అర్హుడు కాడు.

నాశరహితమైన పరమాత్మ తత్త్వము జగత్తునందు అంతటను వ్యాపించియున్నదని యెరుంగుము. శాశ్వతమైన దానినెవ్వరును నశింపజేయజాలరు.

18 అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।

అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ।

అంత వంత- ఇమే-దేహాః-నిత్యస్య- ఉక్తాః-శరీరిణః

అనాశినః - అప్రమేయస్య-తస్మాత్-యుధ్యస్వ-భారత

నిత్యస్య=నిత్యుడును, అనాశినః = అవినాశియు, అప్రమేయస్య= అప్రమేయుడును, శరీరిణః=దేహి యొక్క, ఇమే = ఈ, దేహాః=దేహములు, అంతవంతః = నాశము కలవని, ఉక్తాః=చెప్పబడినవి, తస్మాత్ = అందుచేత, భారత = అర్జునా, యుధ్యస్వ=యుద్ధము చేయుము.

ఓ అర్జునా ! ఈ శరీరములు అన్నియును నశించునవియే. కాని జీవాత్మ నాశరహితము కనుక నీవు యుద్ధము చేయుము.

19 య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।

ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ।

యః ఏనం - వేత్తి-హంతారం-యః-చ- ఏనం-మన్యతే-హతం

ఉభౌ - తౌ - న - విజానీతః - న - అయం - హంతి - న - హన్యతే

యః = ఎవ్వడు, ఏనం = ఈ ఆత్మను, హంతారం=చంపుదానినిగ, వేత్తి = తెలుసుకొనునో, యః చ = మరియెవ్వడు, ఏనం = ఈ ఆత్మను, హతం =

చంపబడుదానినిగ, మన్యతే = భావించునో, తౌ = ఆ, ఉభౌ = ఇరువురును, న విజానీతః = అజ్ఞానులే, అయం = ఈ ఆత్మ, న హంతి = చంపదు, న హన్యతే = చంపబడేదిగాదు.

ఆత్మ ఇతరులను చంపునని భావించువాడును, ఆత్మ ఇతరులచే చంపబడునని భావించువాడును, ఆ ఇద్దఱును అజ్ఞానులే. ఏలనన వాస్తవముగా ఆత్మ ఎవ్వరినీ చంపదు, ఎవ్వరిచేతను చంపబడేది కాదు.

20 న జాయతే మ్రియతే వా కదాచిత్

నాయం భూత్వా భవితా వా న భూయః ।

అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో

న హన్యతే హన్యమానే శరీరే ।

న-జాయతే-మ్రియతే-వా-కదాచిత్-న-అయం-భూత్వా-భవితా -వా-న-భూయః

అజః-నిత్యః - శాశ్వతః-అయం-పురాణః న -హన్యతే-హన్యమానే-శరీరే

అయం= ఈ ఆత్మ, కదాచిత్ = ఎప్పుడును, న జాయతే=పుట్టదు, న మ్రియతే వా=మృతినొందదు, న భూత్వా = లేకనే, భూయః =మరల, భవితా న = ఉండునదియు కాదు, అయం = ఈ ఆత్మ, అజః = పుట్టుక లేనిది, నిత్యః = స్థిరమైనది, శాశ్వతః=నిత్యమైనది, పురాణః = అనాదియైనది, శరీరే = శరీరము, హన్యమానే = చంపబడుచున్నను, న హన్యతే = చావదు.

ఆత్మకు చావుపుట్టుకలులేవు. ఇది జన్మ లేనిది. నిత్యము, శాశ్వతము, పురాతనము, శరీరము చంపబడినను ఇది చావదు.

21 వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।

కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ।

వేద-అవినాశినం-నిత్యం-యః- ఏనం-అజం-అవ్యయం

కథం-సః-పురుషః-పార్థ-కం-ఘాతయతి-హంతి-కం

పార్థ=హే పార్థా, యః = ఎవడు, ఏనం = ఈ ఆత్మను, నిత్యం= ఎల్లప్పుడు ఉండు నదిగను, అవినాశినం = నాశములేని దానినిగను, అజం=పుట్టుకలేని దానినిగను, అవ్యయం= అక్షయమైన దానినిగను, వేద=తెలిసికొనుచున్నాడో, సః=, పురుషః=పురుషుడు, కం= ఎవనిని, కథం= ఎట్లు, ఘాతయతి=చంపించును, కం= ఎవనిని, హంతి=చంపును

ఓ పార్థా! ఈ ఆత్మ నాశరహితము, నిత్యము అనియు, జననమరణములు లేనిదనియు, మార్పులేనిదనియు తెలిసికొనిన పురుషుడు ఎవరిని ఎట్లు చంపించును ? ఎవరిని ఎట్లు చంపును ?

22 వాసాంసి జీర్ణాని యథా విహాయ

నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।

తథా శరీరాణి విహాయ జీర్ణా -

న్యన్యాని సంయాతి నవాని దేహీ।

వాసాంసి - జీర్ణాని- యథా - విహాయ-నవాని-గృహ్ణాతి-నరః-అపరాణి

తథా-శరీరాణి-విహాయ-జీర్ణాని-అన్యాని-సంయాతి-నవాని-దేహీ

యథా= ఏప్రకారము, నరః=మనుష్యుడు, జీర్ణాని=చినిగిన, వాసాంసి= వస్త్రములను, విహాయ=విడిచి, అపరాణి=అన్యమైన, నవాని=నూతనమైన వానిని, గృహ్ణాతి=ధరించినట్లు, తథా=అలాగుననే, దేహీ=జీవుడు, జీర్ణాని = శిథిలములైన, శరీరాణి = శరీరములను, విహాయ = విడిచి, నవాని = నూతనమైన, అన్యాని = అన్యములైన శరీరము లను, సంయాతి=ధరించుచున్నాడు.

మానవుడు చిరిగినపాతబట్టలను వదిలి, కొత్తబట్టలను ధరించినట్లు జీవాత్మపాతశరీరములను వీడి నూతనశరీరములను పొందుతోంది.

23 నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।

న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ।

న- ఏనం-ఛిందంతి-శస్త్రాణి-న- ఏనం-దహతి-పావకః

న-చ- ఏనం-క్లేదయంతి- ఆపః - న-శోషయతి-మారుతః

ఏనం= ఈ ఆత్మను, శస్త్రాణి=శస్త్రములు, న ఛిందంతి=ఛేదింపజాలవు, ఏనం= ఈ ఆత్మను, పావకః = అగ్ని, న దహతి=దహింపజాలదు, చ=మరియు, ఏనం = ఈ ఆత్మను, ఆపః = నీరు, నక్లేదయంతి=తడుపలేదు, మారుతః=గాలి, న శోషయతి= ఎండింపజాలదు.

ఈ ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఎండింపజాలదు.

24 అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ ।

నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః ।

అచ్ఛేద్యః - అయం-అదాహ్యః-అయం-అక్లేద్యః-అశోష్యః- ఏవ-చ

నిత్యః-సర్వగతః-స్థాణుః-అచలః-అయం-సనాతనః

అయం- ఈ ఆత్మ, అచ్ఛేద్యః=ఛేదింపరానిది, అయం= ఈ ఆత్మ, అదాహ్యః=దహింపరానిది, అక్లేద్యః=తడుపరానిది, అశోష్యః ఏవ చ = శోషింపసాధ్యము కానిది. అయం= ఇది, నిత్యః= నిత్యమైనది, సర్వగతః=అంతటను వ్యాపించినది, స్థాణుః=స్థిరమైనది, అచలః=చలనములేనిది, సనాతనః=శాశ్వతమైనది.

ఈ ఆత్మ ఛేదించరానిది, దహింపరానిది, తడుపుటకును, శోషింపజేయుటకును సాధ్యము కానిది. ఆత్మ నిత్యమైనది. సర్వవ్యాప్తిచెందినది, చలింపనిది స్థిరమైనది సనాతనమైనదిది

25 అవ్యక్తోఽయమచింత్యోఽయమ్ అవికార్యోఽయముచ్యతే ।

తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి ।

అవ్యక్తః-అయం-అచింత్యః-అయం-అవికార్యః-అయం- ఉచ్యతే

తస్మాత్- ఏవం-విదిత్వా- ఏనం-న-అనుశోచితుం-అర్హసి

అయం= ఈ ఆత్మ, అవ్యక్తః=వ్యక్తముకానిది, అయం= ఇది, అచింత్యః= మనస్సునకు అందనిది, అయం= ఈ ఆత్మ, అవికార్యః=వికారము లేనిదిగా, ఉచ్యతే=చెప్పబడుచున్నది, తస్మాత్=అందువలన, ఏనం= ఈ ఆత్మను, ఏవం= ఇట్లు, విదిత్వా=తెలిసికొని, అనుశోచితుం=విలపించుటకు, న అర్హసి=తగవు

ఈ ఆత్మ ఇంద్రియములకు గోచరముగానిది. మనస్సునకును అందనిది. వికారములు లేనిది. దీనిని గూర్చి ఇట్లు తెలిసికొనుము. కనుక ఓ అర్జునా ! నీవు దీనికై శోకింపదగవు.

26 అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।

తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి ।

అథ-చ- ఏనం-నిత్యజాతం-నిత్యం-వా-మన్యసే-మృతం

తథాపి-త్వం-మహాబాహో-న- ఏవం-శోచితుం-అర్హసి

మహాబాహూ=అర్జునా, త్వం=నీవు, ఏనం= ఈ ఆత్మను, నిత్యజాతం=నిత్యము పుట్టుచున్న దానినిగను, నిత్యం=నిత్యమును, మృతం వా = నశించుచున్న దానినిగను,

అథ మన్యసే చ =భావించినప్పటికిని, తథాపి=అట్లయినను, ఏవం= ఈ విధముగ, శోచితుం= శోకింప, న అర్హసి=తగవు.

ఓ అర్జునా ఒకవేళ ! ఈ ఆత్మకు జననమరణములు కలవని నీవు భావించినప్పటికిని దీనికై నీవు శోకింపదగదు.

27 జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ ।

తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి।

జాతస్య-హి-ధ్రువః-మృత్యుః-ధ్రువం-జన్మ-మృతస్య-చ

తస్మాత్-అపరిహార్యే-అర్థే-న-త్వం-శోచితుం-అర్హసి

జాతస్య=పుట్టినప్రతి వానికి, మృత్యుః=చావు, ధ్రువః హి=తప్పదు, మృతస్య=మృతి చెందిన వానికి, జన్మ చ=పుట్టుకయు, ధ్రువం=తప్పదు, తస్మాత్=అందువలన, అపరిహార్యే=అనివార్యమగు, అర్థే=విషయమునందు, త్వం=నీవు, శోచితుం=శోకింప, న అర్హసి = తగవు.

పుట్టినప్రతి వానికి మరణము తప్పదు. మరణించిన వానికి పునర్జన్మ తప్పదు. కనుక తప్పనిసరియైన ఈ విషయములయందు నీవు శోకింపదగదు.

28 అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।

అవ్యక్త నిధనాన్యేవ తత్ర కా పరిదేవనా।

అవ్యక్తాదీని-భూతాని-వ్యక్తమధ్యాని-భారత

అవ్యక్త నిధనాని- ఏవ-తత్ర-కా-పరిదేవనా

భారత=అర్జునా, భూతాని=ప్రాణులు, అవ్యక్తాదీని= పుట్టుటకుముందు గోచరించనివియు, వ్యక్తమధ్యాని=మధ్యన గోచరించునవియు, అవ్యక్త నిధనాని ఏవ =

మరణానంతరము కూడ అవి అగోచరములే, తత్ర =అట్టి విషయమున, పరిదేవనా=దుఃఖము, కా = ఏల ?

ఓ అర్జునా ! ప్రాణులన్నియును పుట్టుకకుముందు ఇంద్రియ గోచరములు గావు - మరణానంతరము గూడ అవి అగోచరములే - ఈ జననమరణముల మధ్యకాలము నందు మాత్రమే అవి గోచరములు అగుచుండును. ఇట్టి స్థితిలో వాటికై పరితపించుటవలన ప్రయోజనములేదు.

29 ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్

ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।

ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి

శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్।

ఆశ్చర్యవత్-పశ్యతి-కశ్చిత్- ఏనం- ఆశ్చర్యవత్-వదతి-తథా- ఏవ-చ-అన్యః

ఆశ్చర్యవత్-చ-ఏనం-అన్యః-శృణోతి-శ్రుత్వా-అపి-ఏనం-వేద-న-చ- ఏవ-కశ్చిత్

కశ్చిత్= ఒకానొకడు, ఏనం= ఈ ఆత్మను, ఆశ్చర్యవత్= ఆశ్చర్యమైన దానినివలె, పశ్యతి=గాంచుచున్నాడు, తథా ఏవ= అలాగుననే, అన్యః చ = మరియొకడు, ఏనం= ఈ ఆత్మను, ఆశ్చర్యవత్= ఆశ్చర్యమైనదానివలె, వదతి=పలుకుచున్నాడు, అన్యః చ = వేరొకడు, ఏనం= ఈ ఆత్మను, ఆశ్చర్యవత్= ఆశ్చర్యమైనదానివలె, శృణోతి= ఆలకించుచున్నాడు, శృత్వా= వినియును, కశ్చిత్ అపి చ = ఎవ్వడును, ఏనం= ఈ ఆత్మను, న వేద ఏవ = ఎరుగరు.

ఎవరో ఒక మహాపురుషుడు మాత్రమే ఈ ఆత్మను ఆశ్చర్యకరమైన దానినిగా చూచును. మరియొక మహాత్ముడు దీని తత్త్వమును ఆశ్చర్యకరముగా వర్ణించును.

వేఱొక పురుషుడు దీనిని ఆశ్చర్యకరమైన దానినిగా వినును. ఆ విన్నవారిలో,చూచినవారిలొ,చెప్పినవారిలొ కూడ కొందరు దీనినిగూర్చి ఏమియు పూర్తిగా ఎఱుగరు.

30 దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।

తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ।

దేహీ-నిత్యం-అవధ్యః-అయం-దేహే-సర్వస్య-భారత

తస్మాత్-సర్వాణి-భూతాని-న-త్వం-శోచితుం-అర్హసి

భారత=అర్జునా, సర్వస్య=ప్రతివానియొక్క, దేహే=దేహమునందు, అయం= ఈ, దేహీ= ఆత్మ, నిత్యం= నిత్యమును, అవధ్యః= వధించబడనిది, తస్మాత్=అందుచేత, సర్వాణి=సమస్తమైన, భూతాని = ప్రాణులకొరకు, త్వం= నీవు, శోచితుం=శోకించుటకు న అర్హసి = తగవు.

ఓ అర్జునా ! ప్రతిదేహమునందును ఉండెడి ఈ ఆత్మచంప వీలుకానిది. కనుక ఏ ప్రాణిని గూర్చియైనను నీవు శోకింపదగదు.

31 స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి ।

ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ।

స్వ ధర్మం-అపి-చ-అవేక్ష్య-న-వికంపితుం-అర్హసి

ధర్మ్యాత్-హి-యుద్ధాత్-శ్రేయః-అన్యత్-క్షత్రియస్య-న-విద్యతే

స్వధర్మం అపి=స్వధర్మమునైనను ; అవేక్ష్య చ = గాంచి, వికంపితుం= చలించుటకు, న అర్హసి = తగవు, క్షత్రియస్య=క్షత్రియునకు, ధర్మ్యాత్=ధర్మయుతమైన, యుద్ధాత్= యుద్ధముకంటె, అన్యత్= అన్యమైన, శ్రేయః = శ్రేయస్సు, న విద్యతే హి= ఏదియును లేదు.

అంతేగాక స్వధర్మమునుబట్టియు నీవు భయపడనక్కరలేదు. ఏలననగా క్షత్రియునకు ధర్మయుద్ధమునకు మించినట్టి శ్రేయస్కరమైన కర్తవ్యము మఱియొక విషయము ఏదియును లేదు.

32 యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।

సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ।

యదృచ్ఛయా-చ- ఉపపన్నం-స్వర్గద్వారం-అపావృతం

సుఖినః-క్షత్రియాః-పార్థ-లభంతే-యుద్ధం- ఈదృశం

పార్థ=అర్జునా, యదృచ్ఛయా=అనుకోకుండా, ఉపపన్నం=లభించినదియు, అపావృ తం=తెరువబడినదియైన, స్వర్గద్వారం= స్వర్గద్వారము గలదియు, ఈ దృశం చ = ఇటువంటిదియైన, యుద్ధం= యుద్ధమును, సుఖినః= సుఖవంతులైన, క్షత్రియాః=క్షత్రియులు, లభంతే=లభించును.

అనుకోకుండా తటస్థించిన ఇట్టి యుద్ధము అదృష్టవంతులైన క్షత్రియులకే లభించును. ఇది స్వర్గమునకు తెఱచిన ద్వారము వంటిది.

33 అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।

తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి ।

అథః-చేత్-త్వం- ఇమం-ధర్మ్యం-సంగ్రామం-న-కరిష్యసి

తతః-స్వధర్మం-కీర్తిం-చ-హిత్వా-పాపం-అవాప్స్యసి

అథ=మరియు, త్వం=నీవు, ధర్మ్యం=ధర్మయుతమైన, ఇమం= ఈ , సంగ్రామం= యుద్ధమును, న కరిష్యసి చేత్= ఆచరింపకున్నచో, తతః=అందువలన, స్వధర్మం=స్వధర్మమును, కీర్తిం చ=కీర్తిని, హిత్వా=పోగొట్టుకొని, పాపం= పాపమును, అవాప్స్యసి= చేసినవాడవగుదువు.

ఈ యుద్ధము నీకు ధర్మబద్ధము. ఒకవేళ నీవు దీనిని ఆచరింపకున్నచో నీ స్వధర్మమునుండి పాటిపోయినవాడవు అగుదువు. దానివలన నీవు కీర్తిని కోల్పోయి, పాపము చేసినవాడవగుదువు.

34 అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।

సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే ।

అకీర్తిం-చ-అపి-భూతాని-కథయిష్యంతి-తే-అవ్యయాం

సంభావితస్య-చ-అకీర్తిః-మరణాత్-అతిరిచ్యతే

చ=మరియు, అపి=కూడా, భూతాని=లోకులు, తే=నీయొక్క, అవ్యయాం=శాశ్వతమైన, అకీర్తిం=అపకీర్తిని, కథయిష్యంతి=చిలువలుపలువలుగా చెప్పుకొందురు. సంభావితస్య= మాననీయునకు, అకీర్తిః=అపకీర్తి, మరణాత్ చ=మరణముకంటెను, అతిరిచ్యతే= ఎక్కువ అయినది .

లోకులెల్లరును బహుకాలమువఱకును నీ అపకీర్తినిగూర్చి చిలువలు పలువలుగా చెప్పికొందురు. మాన్యుడైనపురుషునకు అపకీర్తి కన్నను మరణమే మేలు.

35 భయాద్రణాదుపరతం మంస్యంతే త్వాం మహారథాః ।

యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘువమ్ ।

భయాత్-రణాత్- ఉపరతం-మంస్యంతే-త్వాం-మహారథాః

యేషాం-చ-త్వం-బహుమతః-భూత్వా-యాస్యసి-లాఘువం

యేషాం= ఎవరికి, త్వం= నీవు, బహుమతః=మాననీయుడవు, భూత్వా=అయి, లాఘువం= చులకన, యాస్యసి చ = పొందగలవో, మహారథాః=మహారథులు, త్వాం= నిన్ను, భయాత్=భయమువలన, రణాత్=రణరంగమునుండి, ఉపరతం= పారిపోయినట్లు, మంస్యంతే= తల పోయుదురు.

ఈ మహారథులదృష్టిలో ఇప్పుడు నీవు మిక్కిలి మాన్యుడవు. యుద్ధవిముఖుడవైనచో వీరి దృష్టిలో నీవు ఎంతో చులకన అయ్యెదవు. అంతేగాక నీవు పిరికివాడవై యుద్ధమునుండి పారిపోయినట్లు వీరు తలపోయుదురు.

36 అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః।

నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ।

అవాచ్యవాదాన్-చ-బహూన్-వదిష్యంతి-తవ-అహితాః

నిందంతః-తవ-సామర్థ్యం-తతః-దుఃఖతరం-ను-కి

తవ=నీయొక్క, అహితాః=శత్రువులు, తవ=నీయొక్క, సామర్థ్యం= సామర్థ్యమును, నిందంతః=నిందించుచు, బహూన్=అనేక విధములుగ, అవాచ్యవాదాన్ చ = అనరాని మాటలును, వదిష్యంతి=అందురు. తతః=అంతకంటెను, దుఃఖతరం=మించిన దుఃఖము, కిం ను= ఏముంటుంది.

శత్రువులు నీ సామర్థ్యమును నిందించుచు నిన్ను గూర్చి పెక్కు అనరాని మాటలను అందురు. అంతకంటె దుఖఃమేముంటుంది ?

37 హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।

తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ।

హతః-వా-ప్రాప్స్యసి-స్వర్గం-జిత్వా-వా-భోక్ష్యసే-మహీం

తస్మాత్- ఉత్తిష్ఠ-కౌంతేయ-యుద్ధాయ-కృతనిశ్చయః

కౌంతేయ = అర్జునా, హతో వా=చంపబడితివా, స్వర్గం=స్వర్గమును, ప్రాప్స్యసి=పొందగలవు, జిత్వా వా=జయించితివా, మహీం=రాజ్యభోగములను. భోక్ష్యసే=అనుభవించగలవు, తస్మాత్= ఈ కారణముచే, కృతనిశ్చయః= దృ ఢనిశ్చయము కలవాడవై, యుద్ధాయ=యుద్ధమునకు, ఉత్తిష్ఠ=సంసిద్ధుడవు కమ్ము.

ఓ కౌంతేయా ! రణరంగమున మరణించినచో వీరస్వర్గమును పొందెదవు. యుద్ధమున జయించినచో రాజ్యభోగములను అనుభవింపగలవు. కనుక కృతనిశ్చయుడవై యుద్ధమునకు లెమ్ము.

38 సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।

తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ।

సుఖదుఃఖే-సమే-కృత్వా-లాభాలాభౌ-జయాజయౌ

తతః-యుద్ధాయ-యుజ్యస్వ-న- ఏవం-పాపం-అవాప్స్యసి

సుఖదుఃఖే= సుఖదుఃఖములను, లాభాలాభౌ=లాభనష్టములను, జయాజయౌ =జయాపజయములను, సమే=సమానముగ, కృత్వా=తలంచి, తతః=పిమ్మట, యుద్ధాయ=యుద్ధమునకు , యుజ్యస్వ=సిద్ధముకమ్ము, ఏవం= ఇట్లు చేసితివేని, పాపం=పాపమును, న అవాప్స్యసి=అంటవు.

జయాపజయములను, లాభనష్టములను, సుఖదుఃఖములను సమానముగా తలంచి, యుద్ధసన్నద్ధుడవు కమ్ము. అప్పుడు నీకు పాపములు అంటనే అంటవు.

39 ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।

బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ।

ఏషా-తే-అభిహితా-సాంఖ్యే-బుద్ధిః-యోగే-తు- ఇమాం-శృణు

బుద్ధ్యా-యుక్తః-యయా-పార్థ-కర్మబంధం-ప్రహాస్యసి

పార్థ=అర్జునా, సాంఖ్యే=జ్ఞానయోగవిషయమున, ఏషా= ఇంతవరకు చెప్పిన, బుద్ధిః=వివేకము, తే=నీకొరకు, అభిహితా=చెప్పబడినది, ఇమాం=దీనినే, యోగే తు=యోగ విషయమున, శృణు=వినుము, యయా= ఏ, బుద్ధ్యా=బుద్ధిచే, యుక్తః=కూడినవాడవై, కర్మబంధం=కర్మబంధమును, ప్రహాస్యసి= ముక్తుడవవుతావు

ఓ పార్థా ! సాంఖ్యశాస్త్రమున చెప్పబడిన ఈ సమత్వ బుద్ధిని గురించి తెల్పితిని. ఇప్పుడు దానినే కర్మయోగదృక్పథముతో వివరించెదను, వినుము. దానిని ఆకళింపుచేసికొని, ఆచరించినచో కర్మబంధములనుండి నీవుముక్తుడవయ్యెదవు.

40 నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।

స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ।

న- ఇహ-అభిక్రమనాశః-అస్తి-ప్రత్యవాయః-న-విద్యతే

స్వల్పం-అపి-అస్య-ధర్మస్య-త్రాయతే-మహతః-భయాత్

ఇహ= ఇందు, అభిక్రమనాశః=ప్రారంభనాశము, న అస్తి=లేదు, ప్రత్యవాయః=ప్రత్యవాయ దోషము, న విద్యతే= ఉండదు, అస్య= ఈ, ధర్మస్య= ధర్మముయొక్క, స్వల్పమపి = కొంచెమైనను, మహతః= గొప్పదైన, భయాత్=భయమునుండి, త్రాయతే=కాపాడును.

ఈ నిష్కామకర్మయోగమును ప్రారంభించినచో దీనికి ఎన్నటికిని బీజనాశము లేదు. దీనికి విపరీత ఫలితములే యుండవు. పైగా ఈ (నిష్కామ) కర్మయోగమును ఏ కొంచెము సాధనచేసినను అది జన్మమృత్యురూప మహాభయమునుండి కాపాడును.

41 వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।

బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ।

వ్యవసాయాత్మికా-బుద్ధిః- ఏకా- ఇహ- కురునందన

బహుశాఖాః-హి-అనంతాః-చ-బుద్ధయః-అవ్యవసాయినాం

కురునందన=అర్జునా, ఇహ=దీనియందు, వ్యవసాయాత్మికా=నిశ్చయాత్మకమైన, బుద్ధిః= బుద్ధి, ఏకా= ఒక్కటే, అవ్యవసాయినాం= నిశ్చయాత్మకబుద్ధి లేనివారల, బుద్ధయః=బుద్ధులు, బహుశాఖాః= అనేక భేదములు గలవియు, అనంతాః చ హి=అనంతములుగా వుంటాయి.

ఓ అర్జునా! ఈ (నిష్కామ) కర్మయోగమునందు నిశ్చయాత్మక బుద్ధి ఒకటియే యుండును. కాని భోగాసక్తులైన వివేకహీనుల బుద్ధులు చంచలములై, ఒకదారీ తెన్నూ లేక కోరికలవెంట నలువైపులా పరుగులు తీయుచూ అనంతములుగావుంటాయి.

42 యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః ।

వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః ।

యాం- ఇమాం-పుష్పితాం-వాచం-ప్రవదంతి-అవిపశ్చితః

వేదవాదరతాః-పార్థ-న-అన్యత్-అస్తి- ఇతి-వాదినః

పార్థ = అర్జునా, వేదవాదరతాః = వేదవాదములయందురమించువారును, అన్యత్ = మరియొకటి ,అస్తి= ఉండుట, న=లేదు, ఇతి=అని, వాదినః= వాదించువారును, అవిపశ్చితః=అవివేకులు, పుష్పితాం=వికసిత లతవలె రమణీయమగు, ఇమాం= ఇట్టి, యాం వాచం= ఏ మాటలను, ప్రవదంతి =చెబుతున్నారో.

అర్జునా ! వేదవాదములందు రమించువారు, కామ్య కర్మలే అధికమని వాదించువారు, స్వర్గమే ఉన్నతమైనది భావించి ఇలా అంటారు.

43 కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।

క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ।

కామాత్మానః-స్వర్గపరాః-జన్మకర్మఫలప్రదాం

క్రియావిశేషబహులాం-భోగైశ్వర్యగతిం-ప్రతి

కామాత్మానః=కోరికలతో నిండినవారును, స్వర్గపరాః=స్వర్గమే పరమమైనది యని భావించువారును, జన్మకర్మఫలప్రదాం= జన్మమును, కర్మఫలము నొసంగునదియు, క్రియా విశేష బహులాం=బహుళమైన కార్యకలాపములతో నిండినదియు, భోగైశ్వర్య గతిం ప్రతి= భోగములయొక్క, ఐశ్వర్యములయొక్క ప్రాప్తిని గురించినదియు కోరికలతో

కూడినవారు, స్వర్గాభిలాషులును, జన్మమును, కర్మఫలము నొసగునట్టిదియును, భోగైశ్వర్యములనిచ్చునదియు,

44 భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృతచేతసామ్ ।

వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ।

భోగైశ్వర్య ప్రసక్తానాం-తయా-అపహృత చేతసాం

వ్యవసాయాత్మికా-బుద్ధిః-సమాధౌ-న-విధీయతే

భోగైశ్వర్య ప్రసక్తానాం=భోగైశ్వర్యములయందు ఆసక్తికలవారికి, తయా=అట్టిమాటలచే, అపహృత చేతసాం=అపహరించబడిన మనస్సు కలవారికి, వ్యవసాయాత్మికా = నిశ్చయాత్మక మైన, బుద్ధిః=బుద్ధి, సమాధౌ= సమబుద్ధి యందు, న విధీయతే=స్థిరముగా ఉండదు. భోగైశ్వర్య ప్రసక్తికలవారలకు నిశ్చితమైన బుద్ధి ఉండదు.

45 త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।

నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ।

త్రైగుణ్యవిషయాః-వేదాః- నిస్త్రైగుణ్యఃభవ-అర్జున

నిర్ద్వంద్వః-నిత్యసత్త్వస్థః- నిర్యోగక్షేమః- ఆత్మవాన్

అర్జున=అర్జునా, వేదాః= వేదములు, త్రైగుణ్యవిషయాః=త్రిగుణములు విషయములుగా గలవి, త్వం=నీవు, నిస్త్రైగుణ్యః= త్రిగుణరహితుడవు, నిర్ద్వంద్వః= ద్వంద్వరహితుడవు, నిత్యసత్వస్థః= శుద్ధసత్త్వ రూపుడవు, నిర్యోగక్షేమః= యోగక్షేమములకొరకు ఆరాటంలేనివాడు, ఆత్మవాన్= ఆత్మవిదుడవు, భవ=అగుము.

ఓ అర్జునా ! వేదములు సత్త్వరజస్తమోగుణములకార్యరూపములైన సమస్త భోగములను గూర్చియు, వాటిని పొందుటకై చేయవలసిన సాధనలను గూర్చియు

ప్రతిపాదించును. నీవు ఆ భోగముల యెడలను వాటి సాధనలయందును ఆసక్తిని త్యజింపుము. సుఖదుఖాదిద్వంద్వములకు అతీతుడవు కమ్ము. నిత్యుడైన పరమాత్మయందే స్థితుడవు కమ్ము. నీ యోగక్షేమముల కొఱకై ఆరాటపడవద్దు. అంతఃకరణమును వశమునందుంచుకొనుము.

46 యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।

తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ।

యావాన్-అర్థః- ఉదపానే-సర్వతః-సంప్లుతోదకే

తావాన్-సర్వేషు-వేదేషు-బ్రాహ్మణస్య-విజానతః

సర్వతః=అంతటను, సంప్లుతోదకే=జలముతో నిండియున్న, ఉదపానే= జలాశయము నందు, యావాన్= ఎంతగా, అర్థః=లాభముండునో, విజానతః=జ్ఞానియైన, బ్రాహ్మణస్య=బ్రాహ్మణునకు, సర్వేషు=సర్వములైన, వేదుషు= వేదములవలన, తావాన్= అంతియే వుంటుంది.

అన్నివైపులా జలములతో నిండియున్న మహాజలాశయము అందుబాటులోనున్న వానికి చిన్న చిన్న జలాశయములవలన ఎంత ప్రయోజనమో, పరమాత్మప్రాప్తినంది పరమానందమును అనుభవించు బ్రహ్మజ్ఞానికి వేదములవలన అంతియే ప్రయోజనము వుంటుంది.

47 కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।

మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి ।

కర్మణి- ఏవ-అధికారః-తే-మా-ఫలేషు-కదాచన

మా-కర్మఫలహేతుః-భూః-మా-తే-సంగః-అస్తు-అకర్మణి

తే=నీకు, కర్మణి ఏవ = కర్మలయందే, అధికారః=అధికారము, ఫలేషు= ఫలములయందు, కదాచన= ఎన్నటికిని, మా = లేదు, తే=నీకు, కర్మఫలహేతుః =కర్మఫలమునకు నీవు హేతువు, మా భూః=కాకుము, అకర్మణి= కర్మచేయక పోవుటయందు, సంగః= సంగత్వము, మా అస్తు=కలుగ కూడదు.

కర్తవ్యకర్మమునాచరించుటయందే నీకు అధికారముగలదు కాని ఎన్నటికినీ దాని ఫలములయందులేదు. కర్మఫలములకు నీవు హేతువు కారాదు. కర్మలను మానుటయందు నీవు ఆసక్తుడవు కావలదు. అనగా ఫలాపేక్షరహితుడై కర్తవ్యబుద్ధితో కర్మలనాచరింపుము.

48 యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।

సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ।

యోగస్థః-కురు-కర్మాణి-సంగం-త్యక్త్వా-ధనంజయ

సిద్ధ్యసిద్ధ్యోః-సమః-భూత్వా-సమత్వం-యోగః- ఉచ్యతే

ధనంజయ=అర్జునా, సంగం=సంగమును, త్యక్త్వా= విడిచి, సిద్ధ్యసిద్ధ్యోః= ఫలించినను, ఫలించకున్నను, సమః=సమానుడవు, భూత్వా=అయి, యోగస్థః= యోగమునందున్నవాడవై, కర్మాణి=కర్మలను, కురు=చేయుము, సమత్వం=సమబుద్ధి, యోగః=యోగముగా, ఉచ్యతే=చెప్పబడుచున్నది.

ఓ ధనంజయా ! యోగస్థితుడవై ఆసక్తిని వీడి,కార్యములు ఫలించినను ఫలించకున్నను సమత్వ భావమును కలిగియుండి, కర్తవ్యకర్మలను ఆచరింపుము. ~~ఈ~~ సమత్వభావమునే యోగమందురు.

49 దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ ।

బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ।

దూరేణ-హి-అవరం-కర్మ-బుద్ధియోగాత్-ధనంజయ

బుద్ధౌ-శరణం-అన్విచ్ఛ-కృపణాః-ఫలహేతవః

ధనంజయ=ధనుంజయా, బుద్ధియోగాత్=బుద్ధియోగము కంటెను, కర్మ=కామ్యకర్మ, దూరేణ = మిక్కిలి, అవరం హి=తుచ్ఛమైనదికదా, ఫలహేతవః=ఫలము నాశించువారు, కృపణాః=కృపణులు, బుద్ధౌ= జ్ఞానమునందు, శరణం= ఆశ్రయమును, అన్విచ్ఛ=ఆశ్రయింపుము.

ఓ అర్జునా ! ఈ సమత్వబుద్ధితోకూడిన నిష్కామ కర్మకంటే ప్రతి ఫలాపేక్షతో కూడిన సకామకర్మ తక్కువైనది. కాబట్టి నీవు సమత్వబుద్ధియోగమునే ఆశ్రయింపుము. ఏలనన ఫలాసక్తితో కర్మలు చేయువారు అత్యంతదీనులు, కృపణులు.

50 బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే ।

తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ।

బుద్ధియుక్తః-జహాతి- ఇహ- ఉభే- సుకృతదుష్కృతే

తస్మాత్-యోగాయ-యుజ్యస్వ-యోగః-కర్మసు-కౌశలం

బుద్ధియుక్తః=సమత్వ బుద్ధియుక్తుడు, సుకృతదుష్కృతే ఉభే= పుణ్యపాపముల రెండింటిని, ఇహ= ఈ లోకమునందు, జహాతి=విడుచుచున్నాడు, తస్మాత్= కనుక యోగాయ=యోగము కొరకు, యుజ్యస్వ=సిద్ధము కమ్ము, కర్మసు = కర్మలయందు, కౌశలం=కౌశలము, యోగః=యోగము

సమత్వ బుద్ధియుక్తుడైనవాడు పుణ్యపాపములను రెండింటిని ఈ లోకమునందే త్యజించును. అనగా కర్మఫలములు వానికి అంటవు. కనుక నీవు సమత్వబుద్ధి

రూపయోగమును ఆశ్రయింపుము. ఇదియే కర్మాచరణమునందు కౌశలము. ఇదియే యోగము.

51 కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।

జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయమ్ ।

కర్మజం-బుద్ధియుక్తాః-హి-ఫలం-త్యక్త్వా-మనీషిణః

జన్మబంధ-వినిర్ముక్తాః-పదం-గచ్ఛంతి- అనామయం

బుద్ధియుక్తాః= సమబుద్ధియుక్తులైన జ్ఞానులు, మనీషిణః= ఉత్తములు, కర్మజం=కర్మవలన పుట్టిన, ఫలం=ఫలితమును, త్యక్త్వా=విడిచి, జన్మబంధ వినిర్ముక్తాః=జన్మమనెడి బంధము నుండి విడువబడినవారై, అనామయం =దుఃఖరహితమైన, పదం=పదమును, గచ్ఛంతి హి= పొందుదురు.

ఏలనన సమబుద్ధియుక్తులైన జ్ఞానులు కర్మఫలములను త్యజించి, జనన మరణబంధములనుండి ముక్తులయ్యేదరు. అంతేగాక వారు నిర్వికారమైన మోక్షపదమును పొందుదురు.

52 యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।

తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ।

యదా-తే-మోహకలిలం- బుద్ధిః-వ్యతితరిష్యతి

తదా-గంతాసి-నిర్వేదం-శ్రోతవ్యస్య-శ్రుతస్య-చ

యదా= ఎప్పుడు, తే= నీయొక్క, బుద్ధిః=బుద్ధి, మోహకలిలం= మోహమనెడి మాలిన్యమునుండి, వ్యతితరిష్యతి=దాటగలదో, తదా=అప్పుడు, శ్రోతవ్యస్య= వినదగినదానికిని, శ్రుతస్య చ = వినినదానికిని, నిర్వేదం= వైరాగ్యమును, గంతాసి=పొందగలవు.

మోహమనెడి మాలిన్యము నుండి పూర్తిగా బయట పడినప్పుడే నీవు వినిన, వినబోవు ఇహపరలోకసంబంధమైన సమస్తభోగములనుండి వైరాగ్యమును పొందగలవు.

53 శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।

సమాధా వచలా బుద్ధిః తదా యోగమవాప్స్యసి ।

శ్రుతివిప్రతిపన్నా-తే-యదా-స్థాస్యతి-నిశ్చలా

సమాధౌ-అచలా-బుద్ధిః- తదా-యోగం-అవాప్స్యసి

శ్రుతివిప్రతిపన్నా= నానావిధములైన మాటలను వినుటవలన, తే = నీ యొక్క, బుద్ధిః=బుద్ధి, నిశ్చలా=చలనములేనిదియై, అచలా=స్థిరముగా, సమాధౌ=సమాధియందు, యదా= ఎప్పుడు, స్థాస్యతి= స్వస్థత నొందియుండునో, తదా= అప్పుడు, యోగం= యోగమును, అవాప్స్యసి= ఏర్పడును.

నానా విధములైన మాటలను వినుటవలన విచలితమైన నీ బుద్ధి పరమాత్మయందు నిశ్చలముగా స్థిరముగా నిలిచి ఉన్నప్పుడే నీకు ఈ యోగము ఏర్పడును.

అర్జున ఉవాచ

54 స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।

స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ।

స్థితప్రజ్ఞస్య-కా-భాషా-సమాధిస్థస్య-కేశవ

స్థితధీః-కిం-ప్రభాషేత-కిం- ఆసీత-వ్రజేత-కిం

కేశవ=కృష్ణా, సమాధిస్థస్య = సమాధిస్థితుడై, స్థితప్రజ్ఞస్య=స్థితప్రజ్ఞుని యొక్క భాషా=వాచకము, కా = ఏది, స్థితధీః= స్థిరబుద్ధిగల అట్టి పురుషుడు, కిం = ఏమి, ప్రభాషేత= భాషించును, కిం = ఎటుల, ఆసీత = కూర్చొనును. కిం= ఎటుల, వ్రజేత=నడుచును.

అర్జునుడు పలికెను - ఓ కేశవా ! సమాధిస్థితుడై పరమాత్మ ప్రాప్తినందిన స్థితప్రజ్ఞుని యొక్క లక్షణములెవ్వి ? అతడు ఎట్లు భాషించును ? ఎట్లు కూర్చొనును ? ఎట్లు నడుచును ?

శ్రీభగవాన్ ఉవాచ

55 ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్ధ మనోగతాన్ ।

ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ।

ప్రజహాతి-యదా-కామాన్-సర్వాన్-పార్ధ-మనోగతాన్

ఆత్మని-ఏవ-ఆత్మనా-తుష్టః=స్థితప్రజ్ఞః-తదా- ఉచ్యతే

పార్ధ=అర్జునా, యదా = ఎప్పుడు, మనోగతాన్ = మనస్సునందలి, సర్వాన్= సమస్తమైన, కామాన్ = కోరికలను, ప్రజహాతి= విడచునో, ఆత్మనా= ఆత్మచేత, ఆత్మని ఏవ= ఆత్మ యందే, తుష్టః= సంతుష్టుడైనవానిని, తదా= అప్పుడు, సిజ్ఞప్రజ్ఞః= స్థిత ప్రజ్ఞుడని, ఉచ్యతే = అందరు.

శ్రీ భగవానుడు పలికెను - ఓ అర్జునా ! మనస్సునందలి కోరికలన్నియును పూర్తిగా తొలగిపోయి, ఆత్మద్వారా ఆత్మయందు సంతుష్టుడైనవానిని, అనగా పరమాత్మ సంయోగమువలన ఆత్మానందమును పొందినవానిని స్థితప్రజ్ఞుడని యందురు.

56 దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।

వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ।

దుఃఖేషు-అనుద్విగ్నమనాః-సుఖేషు-విగతస్పృహః

వీతరాగభయక్రోధః-స్థితధీః-మునిః- ఉచ్యతే

దుఃఖేషు = దుఃఖము ప్రాప్తించినపుడు, అనుద్విగ్నమనాః=కలతచెందని మనస్సు కల వాడును, సుఖేషు = సుఖము ప్రాప్తించినపుడు, విగత స్పృహః= ఆశలేనివాడును,

వీతరాగ భయక్రోధః= అనురాగము, భయము, క్రోధము వీడినవాడును అగు, మునిః=మనన శీలుడు, స్థితధీః= స్థితప్రజ్ఞుడని ఉచ్యతే = అనబడును.

దుఃఖములకు క్రుంగిపోనివాడును, సుఖములకు పొంగిపోనివాడును, ఆసక్తిని, భయక్రోధములను వీడినవాడును ఐనట్టి మననశీలుడు (ముని) స్థితప్రజ్ఞుడన బడును.

57 యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।

నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ।

యః-సర్వత్ర-అనభిస్నేహః-తత్-తత్-ప్రాప్య-శుభాశుభం

న-అభినందతి-న-ద్వేష్టి-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

యః = ఎప్పుడు, సర్వత్ర = అంతటను, అనభిస్నేహః= మమతాసక్తులు లేనివాడును తత్ తత్= ఆయా, శుభాశుభం = మంచిచెడులను, ప్రాప్య= పొంది, న అభినందతి=సంతోషింపడో, న ద్వేష్టి= ద్వేషింపడో, తస్య = అట్టివానియొక్క, ప్రజ్ఞా=బుద్ధి, ప్రతిష్ఠితా=స్థిరమైనది.

దేనియందును మమతాసక్తులు లేనివాడును, అనుకూల పరిస్థితుల యందు హర్షము, ప్రతికూల పరిస్థితులయందు ద్వేషము మొదలగు వికారము లకు లోనుగానివాడును అగు పురుషుడు స్థితప్రజ్ఞుడు అనబడును.

58 యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః ।

ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ।

యదా-సంహరతే-చ-అయం-కూర్మః-అంగాని- ఇవ- సర్వశః

ఇంద్రియాణి- ఇంద్రియార్థేభ్యః-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

యదా = ఎప్పుడు, అయం= ఇతడు, కూర్మః=తాబేలు, సర్వశః= అన్ని వైపులనుండి, అంగానీవ= అంగములను వలెనే, ఇంద్రియార్థేభ్యః=శబ్దాది విషయములనుండి,

ఇంద్రియాణి= ఇంద్రియములను, సంహరతే= ఉపసంహరించుకొనుచున్నాడో, తస్య=అతని, ప్రజ్ఞా= బుద్ధి, ప్రతిష్ఠితా= స్థిరమైనది.

తాబేలు తనఅంగములను అన్నివైపులనుండి లోనికి ముడుచు కొనునట్లుగా, ఇంద్రియములను విషయాదుల నుండి అన్నివిధముల ఉపసంహరించుకొనిన పురుషుని యొక్క బుద్ధి స్థిరముగా ఉన్నట్లు భావింపవలెను.

59 విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।

రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ।

విషయాః-వినివర్తంతే-నిరాహారస్య-దేహినః

రసవర్జం-రసః-అపి-అస్య-పరం-దృష్ట్వా-నివర్తతే

నిరాహారస్య=విషయములను గ్రహించని, దేహినః=పురుషునకు, రసవర్జం =రాగరహితము గాకుండా, విషయాః=విషయములు, వినివర్తంతే= వైదొలగును, అస్య= ఇతనికి, పరం= పరమును,

దృష్ట్వా=సాక్షాత్కారము అయినందువలన, రసః=రాగము, అపి=కూడా, నివర్తతే=తొలగిపోవును.

ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహింపనివానినుండి ఇంద్రి యార్థములు మాత్రము వైదొలగును. కాని వాటిపై ఆసక్తి మిగిలియుండును. స్థితప్రజ్ఞునకు పరమాత్మ సాక్షాత్కారమైనందు వలన వానినుండి ఆ ఆసక్తిగూడ తొలగిపోవును.

60 యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।

ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ।

యతతః-హి-అపి-కౌంతేయ-పురుషస్య-విపశ్చితః

ఇంద్రియాణి-ప్రమాథీని-హరంతి-ప్రసభం-మనః

కౌంతేయ=అర్జునా, యతతః అపి= ప్రయత్నించినను, విపశ్చితః=వివేకియైన, పురుషస్య=పురుషునియొక్క, మనః=మనస్సును, ప్రమాథీని=ప్రమాదమును కలిగించు, ఇంద్రియాణి = ఇంద్రియములు, ప్రసభం= బలవంతముగ, హరంతి హి=లాగికొని పోవుచునే యుండును.

ఓ అర్జునా ! ఇంద్రియములు మహాశక్తి కలవి, మనుష్యుడు వాటిని నిగ్రహించుటకు ఎంతగా ప్రయత్నించినను, ఆసక్తి తొలగిపోనంతవఱకును అవి అతని మనస్సును ఇంద్రియార్థములవైపు బలవంతముగా లాగికొనిపోవుచునే యుండును.

61 తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।

వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ।

తాని-సర్వాణి-సంయమ్య-యుక్తః- ఆసీత-మత్పరః

వశే-హి-యస్య- ఇంద్రియాణి-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

తాని= ఆ, సర్వాణి= సర్వ (ఇంద్రియములను), సంయమ్య= వశమునందు ంచుకుని, యుక్తః= యోగయుక్తుడు, మత్పరః=నాయందు ప్రియముగలవాడై, ఆసీత= ఉండవలెను, యస్య= ఎవనియొక్క, ఇంద్రియాణి= ఇంద్రియములు, వశే=స్వాధీనము నందున్నవో, తస్య=అతనియొక్క, ప్రజ్ఞా=బుద్ధి, ప్రతిష్ఠితా హి= స్థిరముగా కూడును.

కనుక సాధకుడు ఆ ఇంద్రియములను అన్నింటిని వశము నందుంచుకొని, మత్పరాయణుడై, ధ్యానమునందు కూర్చొనవలెను. ఏలనన ఇంద్రియములను వశమునందుంచుకొనువాని బుద్ధి స్థిరముగానుండును.

62 ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।

సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే ।

ధ్యాయతః-విషయాన్-పుంసః-సంగః-తేషు- ఉపజాయతే

సంగాత్-సంజాయతే-కామః-కామాత్-క్రోధః-అభిజాయతే

విషయాన్=విషయములను, ధ్యాయతః= ధ్యానించుచున్న, పుంసః=పురుషునకు, తేషు= వానియందు, సంగః= ఆసక్తి, ఉపజాయతే= కలుగుచున్నది, సంగాత్= సంగత్వము వలన, కామః=కోరిక, సంజాయతే=పుట్టుచున్నది, కామాత్= కోరిక వలన,క్రోధః= క్రోధము, అభిజాయతే=కలుగును.

విషయచింతన చేయు పురుషునకు ఆ విషయములయందు ఆసక్తి ఏర్పడును. ఆసక్తివలన ఆ విషయములను పొందుటకై కోరికలు కలుగును. ఆ కోరికలు తీరనప్పుడు క్రోధముకల్గును.

63 క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।

స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ।

క్రోధాత్-భవతి-సమ్మోహః-సమ్మోహాత్-స్మృతివిభ్రమః

స్మృతిభ్రంశాత్-బుద్ధినాశః-బుద్ధినాశాత్-ప్రణశ్యతి

క్రోధాత్=క్రోధమువలన, సమ్మోహః=వ్యామోహము, భవతి= కలుగుచున్నది, సమ్మోహతః= మోహమువలన, స్మృతివిభ్రమః= విస్మృతియు, స్మృతిభ్రంశాత్= విస్మృతివలన, బుద్ధినాశః= బుద్ధినాశము, బుద్ధినాశాత్ =బుద్ధినాశము వలన, ప్రణశ్యతి=పతనమగుచున్నాడు.

అట్టిక్రోధమువలన వ్యామోహము కలుగును.దానిప్రభావమునస్మృతిఛిన్నాభిన్నమగును.స్మృతి

భ్రష్టమైనందున బుద్ధి అనగా జ్ఞానశక్తి నశించును. బుద్ధినాశమువలన మనుష్యుడు పతనమగుచున్నాడు.

64 రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।

ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ।

రాగద్వేషవియుక్తైః-తు-విషయాన్- ఇంద్రియైః-చరన్

ఆత్మవశ్యైః - విధేయాత్మా- ప్రసాదం-అధిగచ్ఛతి

రాగ=రాగముచేతను, ద్వేష=ద్వేషముచేతను, వియుక్తైః=విడువబడినట్టియు, ఆత్మవశ్యైః= తనవశమైన, ఇంద్రియైః= ఇంద్రియములచేతను, విషయాన్= విషయములను, చరన్ తు = గ్రహించుచున్నాను, విధేయాత్మా= యోగ యుక్తుడు, ప్రసాదం= ప్రశాంతతను, అధిగచ్ఛతి= పొందుచున్నాడు.

ఇంద్రియములను వశమునందుంచుకొనిన సాధకుడు రాగద్వేషరహితుడై, ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహించుచున్నను ప్రశాంతతను పొందుచున్నాడు.

65 ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।

ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ।

ప్రసాదే-సర్వదుఃఖానాం-హానిః-అస్య- ఉపజాయతే

ప్రసన్నచేతసః-హి- ఆశు-బుద్ధిః-పర్యవతిష్ఠతి

అస్య = ఈ యోగయుక్తునకు, ప్రసాదే=ప్రశాంతము వలన, సర్వదుఃఖానాం= సర్వ దుఃఖముల యొక్క, హానిః=వినాశము, ఉపజాయతే= కలుగుచున్నది, ప్రసన్న చేతసః= ప్రసన్నచిత్తుడైన, ఆశు= శీఘ్రముగ, బుద్ధిః=బుద్ధి, పర్యవతిష్ఠతి హి= స్థిరమగును.

మనోనిర్మలత్వము వలన అతనిదుఃఖములన్నియును నశించును. ప్రసన్నచిత్తుడైన కర్మయోగియొక్క బుద్ధి అన్నివిషయముల నుండియు వైదొలగి, పరమాత్మయందు మాత్రమే పూర్తిగా స్థిరమగును.

66 నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా ।

న చాభావయతః శాంతిః అశాంతస్య కుతః సుఖమ్ ।

న-అస్తి-బుద్ధిః-అయుక్తస్య-న-చ-అయుక్తస్య-భావనా

న-చ-అభావయతః-శాంతిః-అశాంతస్య-కుతః-సుఖం

అయుక్తస్య=యోగయుక్తుడు గానివానికి, బుద్ధిః= వివేకము, న అస్తి = లేదు, అయుక్తస్య = యోగ యుక్తుడు గానివానికి, భావనా చ = ఆత్మ భావనయును, న=లేదు, అభావయతః=భావశూన్యునకు, శాంతిః=శాంతి, న చ=లేదు, అశాంతస్య=శాంతి లేనివానికి, సుఖం= సుఖము, కుతః= ఎట్లు లభించును.

ఇంద్రియనిగ్రహము మనోనిగ్రహము లేనివానికి వివేకము కలుగదు. అట్టి మనుష్యుని అంతఃకరణమునందు ఆస్తికభావమే కలుగదు. తద్భావనా హీనుడైన వానికి శాంతి లభింపదు. మనశ్శాంతి లేనివానికి సుఖము ఎట్లు లభించును ?

67 ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽను విధీయతే ।

తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి ।

ఇంద్రియాణాం-హి-చరతాం-యత్-మనః-అను-విధీయతే

తత్-అస్య-హరతి-ప్రజ్ఞాం-వాయుః-నావం- ఇవ-అంభసి

చరతాం=చరించుచున్న, ఇంద్రియాణాం= ఇంద్రియార్థములయందు, యత్మనః= ఏ మనస్సు, అనువిధీయతే=అనుసరించి, ప్రవర్తించుచున్నదో, తత్=అట్టి మనస్సు, అస్య= ఈ మనుజుని యొక్క, ప్రజ్ఞాం=విచక్షణాశక్తిని, అంభసి=నీటియందు, నావం= ఓడను, వాయుః ఇవ= గాలివలె, హరతి హి=హరించుచున్నది.

నీటిపై తేలుచున్న నావను గాలినెట్టివేయును. అట్లే ఇంద్రియార్థముల యందు సంచరించు ఇంద్రియములలో మనస్సు ఏ ఒక్క ఇంద్రియముతో కూడియున్నను ఆ

ఒక్క ఇంద్రియమే మనోనిగ్రహములేని మనుజునిబుద్ధిని అనగా విచక్షణా శక్తిని హరించిచున్నది.

68 తస్మాద్యస్య మహాబాహో ! నిగృహీతాని సర్వశః ।

ఇంద్రియాణీంద్రియార్థేభ్య ః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ।

తస్మాత్-యస్య-మహాబాహో-నిగృహీతాని-సర్వశః

ఇంద్రియాణి- ఇంద్రియార్థేభ్యః-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

మహాబాహూ=అర్జునా, తస్మాత్=అందువలన, ఇంద్రియార్థేభ్యః= ఇంద్రియ విషయముల నుండి, సర్వశః= అన్ని విధముల, యస్య= ఎవనియొక్క, ఇంద్రియాణి= ఇంద్రియములు, నిగృహీతాని=నిగ్రహించిన, తస్య=పురుషుని యొక్క, ప్రజ్ఞా=బుద్ధి, ప్రతిష్ఠితా= స్థిరమై యున్నది.

కనుక ఓ అర్జునా! ఇంద్రియములను ఇంద్రియార్థముల నుండి అన్నివిధములుగ పూర్తిగా నిగ్రహించిన పురుషునియొక్క బుద్ధి స్థిరముగానుండును.

69 యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।

యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ।

యా-నిశా-సర్వభూతానాం-తస్యాం-జాగర్తి-సంయమీ

యస్యాం-జాగ్రతి-భూతాని-సా-నిశా-పశ్యతః-మునేః

సర్వభూతానాం=సమస్త ప్రాణులకు, యా = ఏది, నిశా= రాత్రియో, తస్యాం=దానియందు, సంయమీ= యోగి, జాగర్తి= మేలుకొనియుండును, యస్యాం=దేనియందు, భూతాని= భూతములు, జాగ్రతి=మేలుకొని యుండునో, సా=అది, పశ్యతః= పరమాత్మతత్వమెరిగిన, మునేః=మునికి, నిశా=రాత్రి.

సమస్త ప్రాణులకు ఏది రాత్రియో అప్పుడు యోగి మేల్కొని యుండును. ఎప్పుడు నశ్వరమైన ప్రాపంచిక సుఖప్రాప్తికై ప్రాకులాడుచు ప్రాణులన్నియు మేల్కొని యుండునో అది పరమాత్మతత్త్వమునెఱిగిన మునికి రాత్రిగానుండును

70 ఆపూర్యమాణమచలప్రతిష్ఠం

సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।

తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే

స శాంతిమాప్నోతి న కామకామీ ।

ఆపూర్వమాణం-అచల-ప్రతిష్ఠం-సముద్రం- ఆపః-ప్రవిశంతి- యద్వత్

తద్వత్-కామాః యం-ప్రవిశంతి-సర్వే-సః-శాంతి- ఆప్నోతి-న- కామకామీ

ఆపూర్యమాణం= అంతటనిండినదియు, అచలప్రతిష్ఠం=చలించక నిలిచి యున్నదియును అగు, సముద్రం=సముద్రమును, ఆపః=నీరు, యద్వత్= ఏ విధముగ, ప్రవిశంతి=ప్రవేశించుచున్నదో, తద్వత్=అలాగుననే, కామాః=విషయములు, సర్వే= అన్నియును, యం = ఎవనిని, ప్రవిశంతి= చేరుచున్నవో, సః=అట్టి యోగి, శాంతిం=శాంతిని, ఆప్నోతి=పొందుచున్నాడు, కామకామీ=భోగాసక్తుడు, న ఆప్నోతి= పొందలేడు.

సమస్తదిశలనుండి పొంగి ప్రవహించుచు వచ్చిచేరిన నదులన్నియును సముద్రమును ఏ విధముగ చలింప చేయ కనే ప్రవేశించుచున్న వో, అలాగే సమస్తభోగములును స్థితప్రజ్ఞునియందు ఎట్టి వికారములను కల్గింపకయే వానిలో లీనమగును. అట్టి పురుషుడే పరమశాంతిని పొందును. భోగాసక్తుడు శాంతిని పొందలేడు.

71 విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిఃస్పృహః ।

నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి

విహాయ-కామాన్-యః-సర్వాన్-పుమాన్-చరతి-నిఃస్పృహః

నిర్మమః-నిరహంకారః-సః-శాంతిం-అధిగచ్ఛతి

యః= ఏ, పుమాన్= పురుషుడు, సర్వాన్=సమస్తములైన, కామాన్= కోరికలను, విహాయ=త్యజించి, నిఃస్పృహః= స్పృహలేనివాడై, నిర్మమః= మమకారము లేనివాడును, నిరహంకారః= అహంకారములేనివాడునునై, చరతి= చరించుచున్నాడో, సః=అట్టివాడు, శాంతిం= శాంతిని, అధిగచ్ఛతి= పొందుచున్నాడు.

కోరికలన్నింటిని త్యజించి, మమతా-అహంకార, వర్జితుడై శబ్దాదివిషయములపై ఎవనికి ఆశ లేదో అట్టి పురుషునకే శాంతిలభిస్తుంది.

72 ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।

స్థిత్వాస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ।

ఏషా-బ్రాహ్మీ-స్థితిః-పార్థ-న- ఏనాం-ప్రాప్య-విముహ్యతి

స్థిత్వా-అస్యాం-అంతకాలే-అపి-బ్రహ్మనిర్వాణం-ఋచ్ఛతి

పార్థ=అర్జునా, ఏషా= ఇది, బ్రాహ్మీస్థితిః= బ్రహ్మజ్ఞానియొక్క స్థితి, ఏనాం= దీనిని, ప్రాప్య= పొంది, న విముహ్యతి=మోహితుడు కాడు, అంతకాలే అపి= అంత్యకాలము నందు అస్యాం= ఈ యోగమునందు, స్థిత్వా=నిలిచి, బ్రహ్మోనిర్వాణం= మోక్షము, ఋచ్ఛతి=పొందుచున్నాడు.

ఓ అర్జునా ! బ్రాహ్మీస్థితి యనగా ఇదియే. ఈ బ్రాహ్మీస్థితిని పొందిన యోగి ఎన్నడును మోహితుడు కాడు. అంత్యకాలము నందును ఈ బ్రాహ్మీస్థితియందు స్థిరముగానున్నవాడు బ్రహ్మోనందరూపమగును మోక్షమును పొందు చున్నాడు.

ఓం తత్సదితి శ్రీ మద్భగవద్గీతాసూపనిషత్సుబ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే

శ్రీకృష్ణార్జున సంవాదే సాంఖ్యయోగో నామ ద్వితీయోఽధ్యాయః